ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 27.0



కొడుకు పార్థివ దేహం వద్ద ఉంచిన ఫొటోపై కుంకుమను సరిచేస్తున్న తండ్రి శ్రీరామ నాయక్



మురళీనాయక్‌కు నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనిత, అనగాని సత్యప్రసాద్ తదితరులు

మురళీనాయక్ పార్థివదేహాన్ని చూసేందుకు తరలివచ్చిన జనం



- అధికార లాంఛనాలతో అంతిమ వీడ్కోలు
- జనవాహిని కన్నీటితో తడిసిన కళ్లి తండా
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళులు
- మురళీ నాయక్ తల్లిదండ్రులకు ఓదార్పు
- పాడె మోసి.. మట్టి ఇచ్చిన మంత్రి లోకేశ్
- మంత్రులు అనిత, అనగాని, సవిత, సత్యకుమార్ నివాళి
- అంతిమయాత్రలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రముఖులు



కొడుకు పార్థివ దేహంపై పడి విలపిస్తున్న తండ్రి శ్రీరామనాయక్



మురళీనాయక్ పార్థివ దేహంపై పడి రోదిస్తున్న సోదరి ప్రీతి

అమరపురికి.. అగ్నివీరుడు

అతని కోసం
అశేష జనవాహిని
తండాకు పోటెత్తింది
కన్నీటి ధారలతో ఆ నేల
తడిసి ముద్దయిపోయింది..!

అగ్నివీరా జయహో
అమర వీరుడా జయహో
నినాదాలు తాకి.. ఆకాశం
ఉలిక్కి పడింది.. ఉద్వేగానికి లోనైంది..

మువ్వన్నెల జెండాను చుట్టుకుని..
సహ వీరుల భుజాలపై..
ఊరి జనం మధ్య ఊరేగింపు..
అగ్నివీరుడి అంతిమ యాత్ర..!



పూల వర్షాలు
పుష్ప గుచ్ఛాలు..
గాలిలో కాల్పులు..
గౌరవ వందనాలు..
ఇది కదా సౌభాగ్యం..!

"అమ్మానాన్నలారా.. ఆత్మ బంధువులారా..
ఏడవకండి.. ఏడవకండి.. ఊరడిల్లండి..!
రుణం తీరిపోయింది.. నేనెళ్లి పోతున్నా..!"

అమరపురికి ఏగిపోయె..
అగ్నివీరుడు నేల వీడి..!

వృథా కాదు నీ మరణం
సువర్ణ కీర్తి త్రివర్ణ పతాకం





రోదిస్తున్న మురళీనాయక్ తల్లి జ్యోతీబాయి

వివరాలు 6లో...

సింహవాహనంపై లక్ష్మీనరసింహుడు



సింహవాహనంపై స్వామి వారు

ఉరవకొండ, మే 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు సింహహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి సింహవాహనంపై కొలువుదీర్చారు. ఉత్సవ మూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఉత్సవ ఉభయదాతలుగా ఎస్ఆర్ కనస్ట్రక్షన్స్ కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి చంద్రప్రభవాహనంపై స్వామి దర్శనమిచ్చారు. ఆలయం చుట్టూ ఉత్సవమూర్తులను ఊరేగించారు. జల్లిపల్లికి చెందిన వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు ఉత్సవ ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఈవో రమేష్‌బాబు, సిబ్బంది మారుతీ, దీపక్ అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహ జయంతి

ఉరవకొండ మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి జయంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి అభిషేకాలు, పూజలను చేశారు. స్వామి జయంతి కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు.



స్వామివారికి ప్రత్యేక అలంకరణ

నేడు గో వాహనోత్సవం

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం గోవాహనోత్సవం, శేష వాహనోత్సవం నిర్వహించనున్నారు.

సీనియారిటీ సమస్య పరిష్కరించండి

డీఈఓకు ఎస్టీయూ నేతల వినతి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, మే 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్ల సీనియారిటీ సమస్య పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు.. జిల్లా విద్యాధికారి (డీఈఓ) ప్రసాద్‌బాబును కోరారు. స్థానిక శారదా మున్సిపల్ హైస్కూల్‌లో ఉన్న డీఈఓను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, నాయకుడు సుధాకర్ కలిశారు. వారు మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో టీచర్ల జాయినింగ్ తేదీల్లో వ్యత్యాసం ఉందన్నారు. ఒక్కో మున్సిపాలిటీలో ఒక్కో రకంగా ఉందన్నారు. ఒకే డీఎస్సీ ద్వారా భర్తీ చేసినప్పటికీ టీచర్ల జాయినింగ్ తేదీల్లో ఒక్కోచోట ఒక్కో రకంగా ఉందని గుర్తుచేశారు. ఈ వ్యత్యాసం వల్ల టీచర్ల సీనియారిటీ, ప్రమోషన్లలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఒకే డీఎస్సీకి చెందిన టీచర్లకు కామన్ జాయినింగ్ తేదీ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు డీఈఓకి వినతిపత్రం అందించారు.

విధేయతకు పట్టం..

ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా వెంకటశివుడు యాదవ్



అనంతపురం, మే 11(ఆంధ్రజ్యోతి): విధేయతకు తెలుగుదేశం పార్టీ పట్టం కట్టింది. రెండున్నర దశాబ్దాలకుపైగా పార్టీని అంటిపెట్టుకుని ఉన్న జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌ను ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా నియమించింది. ఈ మేరకు టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 1997లో సామాన్య కార్యకర్తగా పార్టీలో చేరిన వెంకటశివుడు యాదవ్ గుంతకల్లు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి, కార్యకర్తల అభ్యున్నతి కోసం పనిచేస్తూ వస్తున్నారు. ఆయన పనితీరును గుర్తించి పార్టీ జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీలోనూ పదవులు కట్టబెట్టారు. రాష్ట్ర కార్యదర్శిగా గడిచిన సార్వత్రిక ఎన్నికల వరకు కొనసాగారు. ఎన్నికల అనంతరం పార్టీ అధికారంలోకి రాగానే... టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఆయనకు పదవీ బాధ్యతలు అప్పగించారు. ఓవైపు పార్టీ అభివృద్ధికి పనిచేస్తూనే.. మరోవైపు వైసీపీ విమర్శలను తిప్పికొడుతున్నారు. 2004 నుంచి ప్రతి ఎన్నికల సందర్భంలోనూ గుంతకల్లు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అధిష్టానాన్ని అభ్యర్థిస్తూనే వస్తున్నారు. ప్రతిసారీ అభ్యర్థి రేసులో ఉంటున్నా.. చివరి నిముషంలో టిక్కెట్ దక్కకపోయినా అసంతృప్తికి లోనుకాలేదు. పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిర్ణయించినా వారి విజయానికి పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను పార్టీ అధిష్టానం ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి, చైర్మన్ పదవి కట్టబెట్టినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేశ్, ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్యనేతలందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనని వెంకటశివుడు యాదవ్ స్పష్టం చేశారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

అనంతపురం క్రైం, మే 11(ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా రద్దీగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్పీ జగదీష్ ఆదేశాలతో ఆదివారం జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్టాండ్లు, బస్సులు, రైళ్లు, రైల్వేస్టేషన్లు, ప్రధాన కూడళ్లు తదితర ప్రాంతాలలో ఆయా పోలీసులు తనిఖీలు చేశారు. వ్యక్తుల లగేజీ, బ్యాగుల్లో మద్యం, గంజాయి, డ్రగ్స్, బాంబులు ఇతర పేలుడు వస్తువుల గురించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గుర్తింపు కార్డులను పరిశీలించారు. పోలీస్ అధికారులు, స్పెషల్ పార్టీ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.


జవాన్ అంతిమయాత్ర

అమరపురికి అగ్ని వీరుడు

అధికార లాంఛనాలతో అంతిమ వీడ్కోలు

- జనవాహిని కన్నీటితో తడిసిన కళ్లి తండా
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళులు
- మురళీ నాయక్ తల్లిదండ్రులకు ఓదార్పు
- పాడె మోసి.. మట్టి ఇచ్చిన మంత్రి లోకేశ్
- మంత్రులు అనగాని, సవిత, సత్యకుమార్ నివాళి
- అంతిమయాత్రలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రముఖులు

హిందూపురం, మే 11(ఆంధ్రజ్యోతి): కళ్లి తండా కన్నీటి సంద్రమైంది. వీర జవాను నడిచిన నేల.. అతని అంతిమయాత్ర వేళ తీవ్ర భావోద్వేగానికి లోనైంది. ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన మురళీ నాయక్ అంత్యక్రియలు గోరంట్ల మండలంలోని స్వగ్రామం కళ్లి తండాలో అధికార లాంచనాలతో ఆదివారం ఘనంగా జరిగాయి. ఏపీ, కర్ణాటక సహా పలు ప్రాంతాల నుంచి వేలాది మంది జనం అంతిమ యాత్రలో పాల్గొని, తీవ్ర భావోద్వేగాల నడుమ అగ్ని వీరుడిని అమరపురికి సాగనంపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి అనిత, మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, ఎంపీ, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, మాజీ సైనికులు ఘన నివాళులు అర్పించారు. తమ కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేని తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరామనాయక్ గుండెలవిసేలా రోదించారు. జాతీయ జెండాను కప్పుకుని శాశ్వత నిద్రలోకి వెళ్లిన తమ గారాలపట్టిని ఆఖరిసారిగా హత్తుకుని 'లేవరా మురళీ.. నీకోసం ఎంతమంది వచ్చారో చూడు.. పవన్ కల్యాణ్ సార్ వచ్చాడు.. లేచి సెల్యూట్ చేయరా..' అని పిలుస్తూ బోరున విలపించారు. పవన్ కల్యాణ్ అంటే మురళీ నాయక్‌కు చాలా ఇష్టమని, ఆర్మీకి వెళ్లకముందు జనసేన జెండా పట్టుకుని స్నేహితులతో కలిసి సందడి చేసేవాడని తండావాసులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అప్పటి ఫొటోలను పవన్ కల్యాణ్‌కు చూపించి బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

దేశ సేవలో నేలకొరిగి..

జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరి సెక్టార్‌లో ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి పాక్ సైనికులతో జరిగిన ఎదురు కాల్పుల్లో వీరోచితంగా పోరాడిన మురళీ నాయక్, దేశ మాత సేవలో వీరమరణం పొందారు. ఆయన పార్థివ దేహాన్ని శనివారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చారు. బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి తండా వరకూ వందలాది మంది జనం వెంట నడిచారు. కడపటి వీడ్కోలు పలికేందుకు ఆదివారం ఉదయం నుంచి వేలాది మంది తండాకు తరలివచ్చారు. వేకువ జామునుంచే జవానుకు నివాళులు అర్పించేందుకు క్యూ లైన్‌లో నిలబడ్డారు. జై జవాన్, జై భారత్, మురళీ నాయక్ అమర్ రహే అనే నినాదాలు మిన్నంటాయి. తమ ఊరి బిడ్డకోసం వచ్చిన జనాన్ని చూసేందుకు తండావాసులు మిద్దెలు ఎక్కారు. ఉదయం 8 గంటలకే మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి సత్యప్రసాద్ తదితరులు తండాకు చేరుకున్నారు. మురళీనాయక్‌కు నివాళులు అర్పించి, తల్లిదండ్రులను ఓదార్చారు. ఈ క్రమంలో వారు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పవన్ కల్యాణ్ గంటపాటు తండాలో గడిపి వెళ్లిపోయారు. నారా లోకేశ్ సహా ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు అంతిమయాత్రలో పాల్గొని, మధ్యాహ్నం అంత్యక్రియలు ముగిసేవరకు అక్కడే ఉన్నారు.

అధికార లాంఛనాలతో..

వీర జవాన్ మురళీ నాయక్ అంతిమ యాత్ర ఉదయం 11 గంటల తరువాత మొదలైంది. ఇంటి వద్ద నుంచి పార్థివ దేహాన్ని సైనిక వాహనంలో తీసుకుని వారి వ్యవసాయ క్షేత్రానికి బయలుదేరారు. అంతిమయాత్రలో సుమారు 200 మీటర్ల దూరం సైనికులతో కలిసి నారా లోకేశ్ జవాను పాడెను మోశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సైనికులు గౌరవ వందనం సమర్పించారు. గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించి, గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం పార్థివ దేహాన్ని పేటిక నుంచి బయటకు తీసి తల్లిదండ్రులకు అప్పగించారు. వారు గిరిజన సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలను నిర్వహించారు. మంత్రి నారా లోకేశ్ మట్టి ఇచ్చారు. కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న సహా పలువురు అధికారులు జవానుకు పుష్పాంజలి ఘటించారు.

ప్రముఖుల నివాళి

పుట్టపర్తి/రూరల్: వీర జవాను మురళీ నాయక్‌కు ఎంపీ బీకే పార్థసారథి, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర, ఎంఎస్ రాజు, దగ్గుబాటి ప్రసాద్, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, కొల్లకుంట అంజినప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు సురేంద్ర, బాలాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఉష శ్రీచరణ్, చాంద్‌బాషా, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్ తదితరులు నివాళులు అర్పించారు. వీర జవాను కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. కాలవ శ్రీనివాసులు రూ.50 వేలు అందజేశారు.

యువతకు స్ఫూర్తి: కుంటిమద్ది లక్ష్మీనారాయణ

పెనుకొండ టౌన్: అగ్నివీర్ మురళీ నాయక్ యువతకు స్ఫూర్తి అని రిటైర్డ్ ఐఏఎస్ కుంటిమద్ది లక్ష్మీనారాయణ అన్నారు. కళ్లి తండాకు వచ్చి వీరజవాన్‌కు ఘన నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. అంతిమయాత్రకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడం మన దేశ భక్తికి నిదర్శనమని అన్నారు. కళ్లి తండా పేరును మురళీ నాయక్ తండాగా మార్చాలని నిర్ణయించడం హర్షణీయమని అన్నారు. టీడీపీ నాయకుడు వెంకటేశ్వర రావు ఆయన వెంట వచ్చి నివాళులు అర్పించారు.

ఆత్మబంధువు.. మంత్రి సవిత

అనంతపురం, మే 11(ఆంధ్రజ్యోతి): వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి మంత్రి సవిత అండగా నిలిచారు. తొలి రోజు నుంచి వెన్నంటి ఉన్నారు. విషయం తెలియగానే కళ్లితండాకు వెళ్లి మాతృమూర్తిలా ఆ కుటుంబానికి తోడుగా నిలబడ్డారు. కష్టకాలంలో కన్నీటిని తుడిచారు. ఒక్కగానొక్క కొడుకును పోగొట్టుకుని, పుట్టెడు దుఃఖంలో ఉన్న వీరజవాన్ తల్లిదండ్రులను అక్కున చేర్చుకుని ఓదార్చారు. తక్షణ ఆర్థిక సాయంగా రూ.5 లక్షలు అందజేశారు. మరుసటి రోజు మురళీనాయక్ పార్థివ దేహం బెంగళూరు ఎయిర్ పోర్టుకు చేరుకోగానే అక్కడికి వెళ్లి నివాళులు అర్పించారు. వెంట ఉండి స్వగ్రామానికి తీసుకొచ్చారు. నిద్రాహారాలు మాని అన్ని కార్యక్రమాలను దగ్గరుండి చూసుకున్నారు. మంత్రి హోదాను పక్కన పెట్టి, ఆ కుటుంబానికి ఆత్మబంధువు అయ్యారు. అంత్యక్రియలు నిర్వహించే వ్యవసాయ క్షేత్రానికి మురళీ నాయక్ తల్లి జ్యోతిబాయిని వెంటుండి తీసుకువెళ్లారు. అంత్యక్రియలు పూర్తయ్యాక మురళీ నాయక్ తల్లిదండ్రులను వారి ఇంటికి తీసుకువెళ్లి దగ్గరుండి భోజనం తినిపించారు. 'ధైర్యంగా ఉండండి. ఏ కష్టం వచ్చినా అండగా నేనుంటాను' అని భరోసా ఇచ్చారు. మూడు రోజులపాటు వీరజవాన్ కుటుంబానికి అండగా నిలిచి, మానవతను చాటుకున్నారని తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.


వీరజవాన్ తల్లికి అన్నం తినిపిస్తున్న మంత్రి సవిత


జవాన్ అంతిమయాత్రలో జాతీయ జెండాలతో పాల్గొన్న జనం

అమరజవాన్ చివరిచూపు కోసం తరలి వచ్చిన జనం



జవాన్‌కు సెల్యూట్ చేస్తున్న మంత్రులు అనిత, సవిత, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, పల్లె సింధూర


నివాళి అర్పిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్


అంజలి ఘటిస్తున్న కుంటిమద్ది లక్ష్మీనారాయణ


పూలమాల వేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు, చిత్రంలో గుంటూరు మేయర్ రవీంద్ర


టీడీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్


టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, నెట్టెం వెంకటేశ్, రాయల్ మురళి


ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, శ్రీధర్ చౌదరి, రామలింగారెడ్డి


వీరజవాన్ పార్థివదేహంపై జాతీయ జెండాను కప్పుతున్న ఎమ్మెల్యే రాజు, పరిటాల శ్రీరామ్


అంజలి ఘటిస్తున్న హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి


శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్


ఎస్పీ రత్న


సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప


జవాన్ తండ్రిని ఓదారుస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్


నివాళి అర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి


మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ నివాళి


జవాన్ పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచుతున్న ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథరెడ్డి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట, మాజీ మంత్రి పల్లె, గుండుమల, ఎంపీ బీకే


గాల్లోకి కాల్పులు..


జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్


జవాన్ అంతిమయాత్రలో పాల్గొన్న జనం

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన గుంటు ఓబుళేశుస్వామి విగ్రహం

రామగిరి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు సమీపంలోని కురుకుండ్ల కాలనీలో గుంటు ఓబుళేశు స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో కలశపూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ, వాస్తు హోమాలు నిర్వహించారు. ఉదయం స్వామి వారి ప్రాణప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, బలిహరణ, గోపూజ, పూర్ణాహుతి, మంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. ప్రతిష్ఠ కార్య క్రమానికి పేరూరు గ్రామస్థులతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు..

వైభవంగా నరసింహస్వామి కల్యాణం


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

కనగానపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తాపురం గ్రామంలో ఆదివారం లక్ష్మీనరసింహ స్వామి కల్యా ణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో వెలసిన స్వామి ఆలయంలో నరసింహ స్వామి, లక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు

'ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు ఉచిత విద్య'

అనంతపురం విద్య, మే 11(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్న వారి పిల్లలకు ఉచిత విద్య అందించనున్నట్లు తేజ విద్యాసంస్థల డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆర్మీ ఉద్యోగులు, ఎక్స్ ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు ఉచితంగా ఇంటర్మీడి యట్‌తో పాటు, లక్షల్లో ఖర్చయ్యే ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ, జేఈఈ, నీట్, సీపీటీ వంటి కోర్సుల్లో సైతం ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. దేశ సేవలో ఆర్మీ ఉద్యోగులు అందిస్తు న్న సేవలు వెలకట్టలేనివన్నారు. వారి పిల్లలకు ఉచిత విద్య అందించే అవకాశం రావడం ఆనందంగా ఉందని ప్రకటించారు. రాంనగర్, బళ్లారి రోడ్డులోని తమ విద్యాసంస్థల బ్రాంచ్‌ల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గార్లదిన్నె, మే 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల అవరణంలో సోమవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కారం వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బండారు ఈరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వినోద్‌కుమార్‌తో పాటు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే అందజేయాలని సూచించారు.

పశువుల సంత ఆదాయం రూ. 4.24 లక్షలు

అనంతపురం రూరల్, మే11(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశువులసంతతో రూ. 4,24,520 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,68,290, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ. 1,56,230 వచ్చిందని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠకు విరాళం

అనంతపురం రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేట పంచాయతీ పరిధి లోని పంతుల కాలనీలో ముత్యాలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠకు స్థానిక ఎంపీటీసీ మహబూబ్‌బీ రూ.10,116విరాళంగా ఇచ్చారు. ఆదివారం చంద్రబాబు కొట్టాల్లో ఆమె ముత్యాలమ్మ ఆలయ సభ్యులకు విరాళాన్ని అందజే శారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎంఎస్ఎస్ సాధిక్, నాయకులు వెంకటరాముడు, అక్కమ్మ, మహబూబ్ భాష, కాజా, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చౌక డిపో తనిఖీ

నార్పల, మే 11(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో చౌక డిపోను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జగన్మోహన్‌రావు, నార్పల సీఎస్‌డీటీ చంద్రకళ ఆదివారం తనిఖీ చేశారు. స్టోర్‌లో బియ్యం సరిగా ఇవ్వడం లేదని నడిమిదొడ్డి గ్రామస్థులు ఇటీవల స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో అధికారులు తగిన చర్యలకు ఉపక్రమించారు. అందులో భాగంగా చౌక డిపోను సందర్శించి స్టాక్‌ను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ తో మాట్లాడి కార్డుదారులందరికీ బియ్యం పంపిణీ చేస్తామని ప్రజలకు డీఎస్‌ఓ హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో గల్లంతైన వ్యక్తి మృతి


శ్రీరాములు (ఫైల్)

శింగనమల, మే 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉల్లికల్లు గ్రామ సమీపంలో చాగల్లు రిజర్వాయర్‌లో గల్లంతైన శ్రీరాములు (47) మృతి చెందాడు. ఉల్లికల్లు గ్రామానికి చెందిన శ్రీరాములు శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చాగల్లు రిజర్వాయర్‌లో గల్లంతయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు, ఫైర్ సిబ్బంది, గ్రామస్థులు శ్రీరాములు ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించారు. అయితే ఆదివారం ఉదయం రిజర్వాయర్‌లో శ్రీరాములు మృతదేహం పైకి తేలింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

అనంతపురం క్రైం, మే 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 32 పాడుబడిన ద్విచక్ర వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10గంటలకు పోలీస్‌స్టేషన్ ఆవరణంలో వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు నిర్దేశించిన రుసుము రూ. 3వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. వేలం పాటలో వాహన ధర, జీఎస్టీ అదే రోజు సాయంత్రం 5 గంటల్లోగా చెల్లించాలన్నారు.

మెడికోలకు మస్కా

- రూ.20లక్షలకు పైగా మెస్ డబ్బు పక్కదారి
- సొంత ఖాతాకు జమ చేసుకున్న అకౌంటెంట్
- బకాయి పెరగడంతో సరుకులు ఇవ్వని వ్యాపారి
- వెలుగులోకి వచ్చిన మహిళా అకౌంటెంట్ బాగోతం


మెడికల్ కళాశాల

అనంతపురం టౌన్, మే10 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలో ఓ కిలాడీ అకౌంటెంట్ ఎంబీబీఎస్ విద్యార్థినులకు మస్కా కొట్టింది. మెస్ డబ్బులు హాస్టల్ ఖాతాల్లోకి కాకుండా, సొంత ఖాతాలోకి జమ చేసుకుంది. ఆ డబ్బును తన సొంత పనులకు వాడుకుంది. మెస్‌కు సరుకులు సరఫరా చేస్తున్న ఓ వ్యాపారి అప్పు అధికంగా ఉందని, ఆ డబ్బు చెల్లిస్తేనే సరుకులు ఇస్తానని మొండికేయడంతో ఆ మహిళా అకౌంటెంట్ స్వాహా పర్వం వెలుగులోకి వచ్చింది.

ఏమి జరిగిందంటే...

వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థులకు వసతి, భోజనం కోసం వసతిగృహాలు నిర్వహిస్తున్నారు. ఇందులో 320మంది మహిళా మెడికోలు ఉన్నారు. ఈ మెస్, వసతిగృహాల నిర్వహణకు మెడికోల నుంచి నెలానెలా డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రధానంగా ఉత్తర భారత దేశానికి చెందిన మెడికోలు మన భోజనం తినడానికి ఇష్టపడరు. అలాంటి వారికి ప్రత్యేకంగా వారు కోరుకున్న భోజనం ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా వైద్య కళాశాల హాస్టల్ పేరుమీద ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచారు. ప్రతినెలా ఖర్చు పెట్టిన దాంట్లో లెక్కించిన నిష్పత్తి మేరకు మెడికోలు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఆ డబ్బులతోనే నెలానెలా మెస్ అమలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ అకౌంటెంట్ అలా చేయ కుండా అతితెలివి ప్రదర్శించారు. హాస్టల్ ఖాతా కాకుండా తమపేరుపైనే సొంతఖాతా ఓపెన్ చేసుకొని మెడికోల నుంచి తమ ఖాతాల్లోకి డబ్బు వేయించుకున్నారు. ఇలా దాదాపు రూ.20 లక్షల వరకు మెస్ డబ్బులను పక్కదారి పట్టించినట్లు మెడికోలు, కళాశాల వైద్యవర్గాలు చెబుతున్నాయి.

ఆమె అసలు ఉద్యోగే కాదు

కళాశాల వైద్యాధికారుల తీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ మహిళా అకౌంటెంట్ రెగ్యులర్ నాన్‌టీచింగ్ ఉద్యోగికాదు. కనీసం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికాదంటున్నారు. కేవలం మెయింటెనెన్స్ చేయడానికి మెడికోల డబ్బుతో పెట్టుకున్నట్లు చెబుతున్నారు. అలాంటి అకౌంటెంట్‌కు ఇంతస్థాయిలో అధికారాలు అప్పగించారంటే, ఇక్కడ ఏదో మతలబు ఉందనే ఆరోపణలకు బలం చేకూరుతోంది.

చర్యలు తప్పవు

మెడికోల మెస్ డబ్బులను అకౌంటెంట్ సొంతఖాతాల్లోకి వేసుకొని వ్యాపారికి జమచేయలేదని తెలిసింది. ఈ విషయాన్ని కొందరు మెడికోలు, డాక్టర్లు నా దృష్టికి తీసుకొచ్చారు. లక్షల్లో అన్నారు కానీ ఇంత అని చెప్పలేదు. దీనిపై విచారణకు ఇద్దరు డాక్టర్లను నియమించా. అందులో ఎంతడబ్బు పక్కదారిపట్టింది? ఎలా జరిగిందో తెలుస్తోంది. ఆడబ్బు వెనక్కికట్టాల్సిందే. ఆతర్వాత నాపరిధి మేరకు చర్యలు తీసుకుంటా.

- డాక్టర్ మాణిక్యాల రావు, ప్రిన్సిపాల్ మెడికల్ కళాశాల

వీరజవాన్ మృతికి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ

- మురళీనాయక్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి : ఎంపీ, ఎమ్మెల్యేలు


ర్యాలీ చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు తదితరులు

అనంతపురం అర్బన్, మే 11(ఆంధ్రజ్యోతి): వీరజవాన్ మురళీ నాయక్ ఆత్మశాంతి కోసం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో పార్టీలకు అతీతంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆదివారం రాత్రి క్లాక్ టవర్ నుంచి సప్తగిరి సర్కిల్‌లోని అమరవీరుల స్థూపం దాకా కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. అంతకు ముందు మురళీ నాయక్ బ్యానర్‌కు పూల మాల వేసి నివాళులర్పించారు. ర్యాలీ అనంతరం అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొతులతో నివాళులర్పించారు. వీరజవాన్ మురళీ నాయక్ అమర్ రహే... భారత్‌మాతాకి జై... వందేమాతరం అంటూ నినదించారు. రాజకీయాలకు అతీతంగా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ బీకే, ఎమ్మెల్యేలు దగ్గపాటి, ఎంఎస్ రాజు మాట్లాడుతూ... వీరజవాన్ మురళీ నాయక్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, బీజేపీ నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, లలిత్ కుమార్ సీపీఐ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జగదీష్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, కాంగ్రెస్ అనంతపురం నియోజకవర్గం ఇన్‌చార్జి దాదాగాంధీ, సీపీఐ నాయకులు నారాయణస్వామి, టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గంగారామ్, సుధాకర్ యాదవ్, సరిపూటి రమణ, కూచి హరి, డేగల కృష్ణమూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, బల్లాపల్లవి, సంగా తేజస్విని, చరిత, స్వామిదాస్, నెట్టెం బాలకృష్ణ, లక్ష్మీనరసింహ, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై వినతి

- సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్ వెల్లడి

అనంతపురం న్యూటౌన్ మే 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆధ్వర్యంలో విశ్రాంతి పంచాయతీరాజ్ కమిషనర్, ఆలూరు ఎమ్మెల్యే రామాంజినేయులును కలిసి ఆదివారం వినతిపత్రం అందించినట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లా ఆలూరు పట్టణంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేని కలిసి తమ సమస్యలపై విన్నవించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల రీ గ్రూపింగ్‌పైన చర్చించామని, ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన వారిని గౌరవప్రదమైన గ్రేడ్‌లో ఉంచాలని కోరినట్లు తెలిపారు. దీంతో ఆయన సానుకూలాగా స్పందించారని తెలిపారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్య మంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమేష్, నాగరాజు, మహేష్, రాము, మురళి, అరుణ్, శ్రీనివాసులు, లెనిన్, బాలన్న, నబి, జిలాన్, బాషా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు


విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనంతపురం రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లి సమీపంలో పాలవేరు వీరనాగమ్మ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాతిదూలం లాగుడుపోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉత్సవాల్లో రెండో రోజు ఆదివారం తెల్లవారుజామున గంగపూజ నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో నుంచి అమ్మవారి ఆలయం వరకు ఉత్సవ విగ్రహం ఊరేగింపు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా క్యాటగిరి ఎద్దులచే రాతిదూలం లాగుడుపోటీలు నిర్వహించారు. తాడిపత్రికి చెందిన రాజశేఖర్‌రెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. అలాగే రామకృష్ణారెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో నిలవగా, సోమలదొడ్డి గ్రామానికి చెందిన వీరశేషారెడ్డి వృషభాలు తృతీయ స్థానం, పెనకచెర్లకు చెందిన యశ్వంతరెడ్డి వృషభాలు నాలుగో స్థానం, చింతలపల్లికి చెందిన క్రాంతిచౌదరి వృషభాలు ఐదో స్థానంలో నిలిచా యి. మొదటి ముగ్గురు విజేతలకు టీడీపీ రాష్ట్ర నాయకులు జయరాంనాయుడు 1. 20లక్షలు, నాలుగు, ఐదో స్థానంలో నిలిచిన వారికి టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ రూ.30వేలు నగదు బహుమతులకు అందించారు. విజేతలకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు శ్రీనివాసరెడ్డి తదితరుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

310 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, మే 11(ఆంధ్రజ్యోతి): కనకదాస విద్య, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గుత్తి రోడ్డులోని కనకదాస కల్యాణమండపంలో విద్యార్థిని, విద్యార్థులకు కనకదాస ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన 310 మంది విద్యార్థులకు ముఖ్యఅతిథిగా హాజరైన తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఆ సంఘం నాయకుల చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవిజన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య మాట్లాడుతూ... 570 మార్కులు దాటిన విద్యార్థులకు తమ కళాశాలలో ఉచిత విద్యను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కనకదాస ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మర్రిస్వామి, ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు, మాజీ మేయర్ రాగే పరశు రాం, కురబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, కనకదాస ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం నాయకులు వీరనారప్ప, సతీష్‌కుమార్, పరశురాం, నారాయణస్వామి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా పలు పోటీలు

బుక్కరాయసముద్రం, మే 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంతులూరులో వెలసిన చెన్నకేశవ స్వామి బ్రహోత్సవాల సందర్భంగా ఆదివారం పలు పోటీలు నిర్వహించారు. గ్రామంలో మహిళలకు ముగ్గులు పోటీలు, పురుషలకు ట్రాక్టర్ పందేలు, బైక్ రైస్ పోటీలను నిర్వహించారు. విజేతలకు టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రామానాయుడు రూ. 50వేలు నగదు బహుమతులను అందజేశారు. తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు రంగమ్మ చేతులమీద ముగ్గులు పోటీల్లో విజేతలకు రూ. 15వేలు నగదు బహుమతులు అందజేశారు. చెన్నకేశవ స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.


ముగ్గుల పోటీల్లో విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న టీడీపీ నాయకులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

శింగనమల, మే 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి జీవితంలో స్నేహ బంధం ఎంతో విలువైన దని పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో అప్పటి ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శింగనమల జడ్పీ ఉన్నత పాఠశాలలో 2000-2001 విద్య సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కన్నులపండువగా జరిగింది. వారంతా 24 సంవత్సరాల తరువాత ఒకచోట చేరి ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకుని రోజంతా సంతోషంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు చంద్ర శేఖర్, లక్ష్మిరెడ్డి, శేషాద్రి శర్మ, బంగారప్ప, దివాకర్‌రెడ్డి, సిరాజుద్దీన్, మహమ్మద్‌రఫి, ఆదినారాయణ, మునిస్వామి, రాంభూపాల్‌రెడ్డిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. తాము చదువుకున్న పాఠశాలకు పాఠశాల అవరణంలో మినీపార్కు అభివృద్ధికి తమవంతుగా రూ. 50 వేలు అందజేస్తామని ప్రకటించారు. తనతో పాటు చదువుకున్న తోటి మిత్రులు కొందరు మృతి చెందడంతో వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీకాంత్‌రెడ్డి, శివారెడ్డి, నందిగౌడ్, రజాక్, ప్రకాష్, రామకృష్ణరెడ్డి, నసీమా, అంజలి, సులోచన, అనిత, నాగేశ్వరి, హరిత, సుజాత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్‌కు స్వర నీరాజనం


మురళీనాయక్‌కు స్వరనీరాజనం పలుకుతున్న గాయనీ గాయకులు

అనంతపురం కల్చరల్, మే 11(ఆంధ్రజ్యోతి): భారత్ - పాకిస్తాన్ పోరాటంలో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు సంగీత కళాకారులు స్వరనీరాజనం పలికారు. ఆదివారం సాయంత్రం హౌసింగ్ బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులో పద్మశ్రీ ఘంటసాల సాంస్కృతిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మురళీనాయక్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అలాగే దేశభక్తి గీతాలు ఆలపించి స్వర నీరాజనం పలికారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, సభ్యులు జీవీ రామయ్య, ఓబులదాస్, సతీష్, నందు, శ్రీదేవి, విజయలక్ష్మి, ఇందిర, కేశవ, పద్మజ, గోవర్ధన్, బులు, మంజుల, నౌవోమి తదితర గాయనీ గాయకులు పాల్గొన్నారు.

మురళికి ఘన నివాళి


మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ కొత్తపల్లి గ్రామస్థులు

రామగిరి, మే 11(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన అగ్నివీర్ మురళీనాయక్‌కు మండలంలోని ఆర్ కొత్తపల్లి గ్రామస్థులు ఆదివారం సాయంత్రం ఘనంగా నివాళులర్పించారు. ఆర్ కొత్తపల్లి, ఆర్ కొత్తపల్లితండా గ్రామస్థులు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మురళీనాయక్ అమర్ రహే, భారత్‌మాతాకి జై అంటూ నినదించారు. దేశం కోసం ప్రాణా లర్పించిన వీర జవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతికలగాలని ఆకాంక్షించారు. నేటి యువతకు మురళీనాయక్‌కు ఆదర్శంగా నిలుస్తారన్నారు. అతి చిన్నవయస్సులో దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలబడటం ఎంతో సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు శ్రీరాములునాయక్, గోరంట్ల లక్ష్మీనారాయణ, రామకృష్ణ నాయక్, నరసింహనాయక్, సంజీవులు, గోళ్ల మూర్తి, అక్కులప్ప, నారాయణ, ముత్యాలు, నరేశ్, మహిళలు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపరచిన ఆర్డీటీ

- ఏడో రోజుకు చేరిన రిలేదీక్షలు


రిలే దీక్షల్లో పాల్గొన్న నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 11(ఆంధ్రజ్యోతి): కరువునేలలో లక్షలాది కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేలా ఆర్డీటీ సేవలందించిందని వివిధ రంగాల ప్రముఖులు పేర్కొన్నారు. ఆర్డీటీకీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఏడో రోజైన ఆదివారం కమిటీ కన్వీనర్ సాకేహరి అధ్యక్షతన వహించిన రిలే దీక్షల్లో ముందుగా వీరజవాన్ మురళీనాయక్‌కు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. క్రికెట్‌కోచ్ చంద్రమోహన్‌రెడ్డి, డిస్కవరీ అనిల్‌కుమార్, మాల మహానాడు ఓబులేసు, సామాజిక కార్యకర్త మంజునాథ్, భీమ్‌సేనరావు దీక్షలకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవాలను దృష్టిలోపెట్టుకుని విదేశీ నిధుల సమీకరణకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, సుగమంచి శ్రీనివాసులు, టీవీ రెడ్డి, బీకేఎస్ ఆనంద్, ప్రభాకర్, మంజునాథ్, సూర్యనారాణ, కోచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'హైకోర్టులో దావా వేస్తాం'

ఆర్డీటీ సేవలు కొనసాగించేలా అడ్డంకులు తొలగించాలని రాష్ట్ర హైకోర్టులో దావా వేయనున్నట్లు బహుజన లాయర్స్ ఫోరం(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ నారాయణప్ప పేర్కొన్నారు. జిల్లాలో రంగాల అభివృద్ధికి ఫాదర్ ఫెర్రర్ ఆర్డీటీ ద్వారా పునాదులు వేశారన్నారు. ఈ సేవలను అంతరాయంలేకుండా కొనసాగించాలంటే ఎఫ్‌సీఆర్ఏను కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయాల్సి ఉందన్నారు. ఈ అంశంపై బీఎల్ఎఫ్ కార్యాలయంలో లాయర్స్ మేధావులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి దావా వేయడానికి తీర్మానించినట్లు నారాయణప్ప పేర్కొన్నారు.


యాడికిలో మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జనసేన నాయకులు


తాడిపత్రిలో భవన నిర్మాణ కార్మికుల నివాళి..


ఉద్దేహాళ్‌లో యువత..


శనగలగూడూరులో గ్రామస్థులు..


గుత్తిలో వైసీపీ నాయకులు


గుంతకల్లులో.. వైసీపీ నాయకులు

వీరసైనికుడు మురళీనాయక్‌కు ఘన నివాళి

● ఊరూరా ర్యాలీలు

యాడికి, మే11(ఆంధ్రజ్యోతి): భారత్-పాక్ యుద్ధంలో అసువులు బాసిన అగ్నివీర్ సైనికుడు మురళీనాయక్‌కు మండలకేంద్రంలోని జనసేన నాయకులు ఆదివారం ఘన నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. మురళీనాయక్ త్యాగాన్ని దేశం ఎన్నటికీ మరవదని తెలిపారు. ఆయన కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా అండగా ఉండాలని కోరారు. నాయకులు శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

●యల్లనూరు: వీరజవాన్ మురళీనాయక్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించినట్లు టీడీపీ మండల నాయకుడు అనిల్‌కుమార్ చౌదరి తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కళ్లితండాలో టీడీపీ నాయకులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్నట్లు తెలిపారు.

● బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్‌లో యువత మురళీనాయక్‌కు ఘననివాళి అర్పించారు. టీడీపీ యూత్ నాయకుడు మున్నా ఆధ్వర్యంలో అతడి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పుష్పాలతో నివాళులర్పించారు.

● పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు గ్రామంలో మురళీనాయక్‌కు గ్రామస్థులు ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జోహార్ ముర ళీనాయక్ అంటూ నినాదాలు చేశారు.

● తాడిపత్రి: పట్టణంలోని గాంధీసర్కిల్లో తాడిపత్రి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం మురళీనాయక్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుమునుపు ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నుంచి గాంధీసర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు వెంకట్, సభ్యులు గంగయ్య, నాగరాజు, రఫీక్, జక్కన్న, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● గుత్తి: పట్టణంలో వైసీపీ శ్రేణులు మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురళీనాయక్ అమర్‌హై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ హుసేన్ పీరా, నాయకులు గురుప్రసాద్‌యాదవ్, రంగస్వామి, శివరామ్, రమణ, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ శ్రేణులు మురళీనాయక్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. మురళీనాయక్ అమర్‌హై అంటూ నినాదాలు చేశారు. పట్టణ అధ్యక్షుడు ఎండీఆర్ ఖలీల్, నాయకులు దరశథ్‌రెడ్డి, అబ్దుల్‌బాసిద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గాంధీ సర్కిల్, అజంతా సర్కిల్ వరకు కొనసాగింది. సంఘం పట్టణ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

● కూడేరు: మండలకేంద్రంలో మురళీనాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు. సేవాలాల్ కాలనీలో దళిత, గిరిజనులతోపాటు పలువురు మురళీనాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మురళీనాయక్ కుటుంబానికి జేసీ ఆర్థిక సాయం

హిందూపురం: ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలొదిన వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం ఆయన కళ్లితండాకి వచ్చి మురళీనాయక్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అతడి తల్లిదండ్రులను ఓదార్చి లక్ష రూపాయల చెక్కును అందజేశారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

కుందుర్పి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లి కి చెందిన స్కూల్ కమిటీ మాజీ చైర్మన్, వైసీపీ కార్యకర్త ఉప్పర రాజు గత బుధవారం మండలకేంద్రంలోజరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదివారం ఆయన కుటుంబసభ్యుల్ని ఫోన్‌లో పరామర్శించారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకుల చేత రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రవి, బెస్తరపల్లి మాజీ సర్పంచ్ రాఘవేంద్రబాబు, కుందుర్పి మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, చిత్రలింగప్ప, కరిగాన పల్లి సర్పంచ్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చింతలాంపల్లిలో ముగ్గురిపై దాడి..

గుంతకల్లుటౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలాంపల్లి గ్రామంలో ఆదివారం రస్తా విషయమై సీ. జయరాముడు, తిమ్మప్ప, నవీన్‌పై అదే గ్రామానికి చెందిన బండయ్య, బ్రహ్మయ్య, రవి, ఎమ్మాడి జయరాముడు, కుమార్‌లు దాడి చేశారు. సీ.జయరాముడు తన ఇంటి వద్ద ఉన్న దిబ్బలోని ఎరువును ట్రాక్టర్‌లో తన పొలానికి తరలిస్తున్నాడు. అయితే ట్రాక్టర్ ఇలా వెళ్లకూడదని, రస్తా లేదని.. వెనక్కి పోవాలని బ్రహ్మయ్య చెప్పాడు. దీంతో జయరాముడుతో పాటు తిమ్మప్ప, నవీన్ పొలాలకు పూర్వం నుంచి ఇదే రస్తా కొనసాగుతోందని, ఇప్పుడు అడ్డుకోవడం మంచిదికాదని తెలిపారు. దీంతో ఆగ్రహం చెందిన బ్రహ్మయ్య, రవి, ఎమ్మాడి జయరాముడు, కుమార్‌లు రాళ్లతో, కొడవళ్లతో వారిపై దాడి చేసి గాయపరిచారు. కుటుంబసభ్యులు వెంటనే గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత బాధితులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

డీ.హీరేహాళ్, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యం గ్రామంలో చిత్రలింగం అనేవ్యక్తి అదే గ్రామానికి చెందిన రామాంజిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో ఆయన చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కల్యం గ్రామానికి చెందిన తిప్పేస్వామి కుమారుడు రామాంజి(36) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఇతడికి అదే గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహం జరిగింది. వీరికి నలుగురు కుమారులు సంతానం. కాగా అతను ఈ నెల 8వ తేదీ రాత్రి ఇంటి వద్ద భార్యతో గొడవపడుతుండగా.. ఆ సమయంలో అటుగా వెళుతున్న నాగరాజు మందలించాడు. ఇది భార్యాభర్తల గొడవ, నీకు సంబంధం లేదని రామాంజి ఆగ్రహించాడు. కాగా మరుసటి రోజు రామాంజి ఇంటి వద్ద ఉన్న సమయంలో నాగరాజు తమ్ముడు చిత్రలింగ వెళ్లి మా అన్నను ఎందుకు దుర్భాషలాడావు అని గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన రామంజిని వెంటనే కుటుంబసభ్యులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు చిత్రలింగంను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

హంద్రీనీవా ద్వారా చెరువులకు నీరు ఇవ్వాలి: సీపీఐ

గుంతకల్లుటౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా గుంతకల్లు మండలంలోని చెరువులకు నీరు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ జగదీష్ డిమాండ్ చేశారు. మండలంలోని దోనిముక్కల గ్రామంలో ఆదివారం సీపీఐ రూరల్ మండల 4వ మహాసభలను నిర్వహించారు ముఖ్యఅతిథిగా జగదీష్ హాజరయ్యారు. ముందుగా పాక్ సైనికుల దాడిలో మృతిచెందిన మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యలపైన నిత్యం పోరాటాలను కొనసాగిస్తామన్నారు. గ్రామాలలో పార్టీని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం పలు తీర్మాణాలను చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శి మహేష్, మండల కార్యదర్శి రాముతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుత్తిరూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన మహేంద్ర (22) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహేంద్ర కడుపునొప్పి తాళలేక ఈ నెల 8న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత కర్నూలుకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఎలుగుబంటి దాడిలో రైతుకు గాయాలు

కళ్యాణదుర్గం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్లపల్లి గ్రామంలో ఆదివారం రైతు రామాంజినేయులుపై ఎలుగుబంటి దాడి చేసింది. ఇంటి సమీపాన ముళ్లపొదల్లోకి బహిర్భూమికి వెళ్లిన రైతు పై దాడి చేసి ఎడమ చేతిని గాయపరిచి పారిపోయింది. రక్తపుగాయాలతో పడి వున్న రామాంజినేయులును గమనించిన చుట్టుపక్కల రైతులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అటవీశాఖ అధికారులు బాధితుడితో సంఘటనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఎలుగుబంట్ల దాడులు రోజురోజుకి అధికమవుతున్న నేపథ్యంలో రైతులు తోటల్లోకి వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.

వైభవంగా లక్ష్మీనారసింహుడి జయంత్యుత్సవాలు

● ఆలయాల్లో ప్రత్యేకపూజలు, కల్యాణోత్సవాలు


తాడిపత్రి మండలం ఆవులతిప్పాయపల్లిలో ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లోని నరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలను, కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయమే అర్చకులు ఆలయాల్లోని స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయాల ఆవరణలలో ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ, మంగళవాయిద్యాల మధ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని వేడుకను వీక్షించారు. తర్వాత తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రెండేళ్ల తర్వాత కేసు నమోదు

● వైసీపీ హయాంలో పశువైద్యశాల కూల్చివేత


కూల్చివేసిన పశువైద్యశాల (ఫైల్)

బొమ్మనహాళ్, మే 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రభుత్వ అస్తులను ఇష్టారాజ్యంగా ధ్వంసం చేశారు. అడిగేవారు లేరని ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా వ్యవహరించారు. ప్రభుత్వ భవనాన్ని కూల్చడమే కాక రెవెన్యూ అధికారుల అండతో ఆ స్థలంపై హక్కులు పొంది మరొకరి పేరుపై కణేకల్లు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ప్రభుత్వం మారిన తర్వాత వైసీపీ నాయకుల బాగోతం వెలుగులోకి వచ్చింది. మండలంలోని గోవిందవాడ గ్రామంలో పశువైద్యశాల భవన నిర్మాణం కోసం 2000 సంవత్సరంలో బళ్లారి సిద్దమ్మ అనే మహిళ గ్రామంలోని 170సీ సర్వే నెంబర్‌లో 3 సెంట్లు స్థలాన్ని ప్రభుత్వానికి ఇచ్చింది. 2001లో అనంతపురం అప్పటి ఎంపీ కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం అప్పటి ఎమ్మెల్యే పాటిల్ వేణుగోపాల్ రెడ్డి పశువైద్యశాలను ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం రావడంతో 2023లో భవనం శిథిలావస్థకు చేరిందని కూల్చి స్థలాన్ని మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించి సొమ్ము చేసుకున్నారు. అప్పట్లోనే ఆంధ్రజ్యోతి పత్రిక రెండురోజుల పాటు కథనాలు ప్రచురించింది. దీంతో కళ్యాణదుర్గం అప్పటి ఆర్డీఓ సుష్మిత తనిఖీ చేసి తూతూ మంత్రంగా మెమోలు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం మారడంతో కొందరు గ్రామస్థులు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అక్కడి నుంచి ఆదేశాలు రావడంతో పశువైద్యాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల తర్వాత కేసు నమోదైంది. భవనం కూల్చివేతపై గ్రామ ప్రజలు అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పశువైద్యాధికారి ఫిర్యాదుతో కేసు నమోదు

బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా పశువైద్యశాల భవనాన్ని కూల్చారని పశువైద్యాధికారి వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. 2001 లో భవనం నిర్మించారని, శిథిలావస్థకు చేరిందని మరో భవనంలో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. గ్రామానికి చెందిన శరణబసవ, చిదానంద భవనం కూల్చి స్థలాన్ని ఆక్రమించారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో శరణబసవ, చిదానందలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దీని వెనుక ఇంకా ఎవరు ఉన్నారనేది దర్యాప్తులో తేలుతుందని పేర్కొన్నారు.

దశభుజగణపతిని దర్శించుకున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి


దశభుజగణపతిని దర్శించుకుంటున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి

రాయదుర్గం, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దశభుజ గణపతి ఆలయాన్ని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దశభుజగణపతికి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, అర్చకులు చిత్రపటాన్ని ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ జయనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మురడి అంజన్న సేవలో కలెక్టర్


ఆంజనేయస్వామి సన్నిధిలో కలెక్టర్, కుటుంబసభ్యులు

డీ.హీరేహాళ్, మే 8(ఆంధ్రజ్యోతి): మురడిఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం కలెక్టర్ వినోద్‌కుమార్ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించారు. అలాగే ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తర్వాత శాలువాతో సత్కరించి ఆంజనేయస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామాంజనేయ, దేవాదాయ శాఖ ఈఓ నరసింహారెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

దాడి చేశారని టీడీపీ నాయకుడి ఫిర్యాదు

గుత్తి,మే11(ఆంధ్రజ్యోతి): తనపై రైల్వే కానిస్టేబుల్‌తో పాటు మరో ఎనిమిది మంది ఆయన అనుచరులు దాడికి పాల్పడ్డారని ఆదివారం రాత్రి టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు కోనంకి కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక అనంతపురం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో 24వ వార్డు గ్రామ కమిటీ ఏర్పాటు చేస్తుండగా వారు తనపై దాడికి పాల్పడి దుర్భాషలాడారని తెలిపారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ నాయకులు సంబరాలు

గుత్తి, మే11(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌ను ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా నియమించడంతో ఆదివారం రాత్రి పట్టణంలో టీడీపీ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు జరిపారు. తెలుగు యువత నాయకులు సుధాకర్‌నాయుడు, బోర్ వెల్ నాగరాజు, నరేంద్రచౌదరి, నాగరాజు, పవన్‌కుమార్, నిజాం, ఆచారి పాల్గొన్నారు.

కసాపురంలో హోమం

గుంతకల్లుటౌన్,మే11(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఆయుష్య హోమాన్ని నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో అర్చకులు ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువదీర్చారు. ఆయుష్య హోమం, పూర్ణాహుతి, నిర్వహించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల సమావేశం

పామిడి, మే 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ త్వరలో గుత్తిలో పర్యటించనున్నారని, విజయవంతం చేయాలని కోరారు. పార్టీ డాక్టర్ సెల్ జిల్లా అధ్యకురాలు డాక్టర్ పత్తి హిమబిందు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, హెచ్చెల్సీ ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ వెంకటేష్, జనసేన మండల అధ్యక్షులు ధనుంజయ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆయన స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జరిగిన వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ వేడుకలోనూ, అంబేడ్కర్ కాలనీలో అనంత డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ప్రారంభోత్సవంలోనూ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గుమ్మఘట్టలో గురువులతో పూర్వ విద్యార్థులు

గుమ్మఘట్ట/కణేకల్లు/పుట్లూరు/శెట్టూరు, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో 2006-07 వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్ల ఒకచోట కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే కణేకల్లు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో 2004-05 వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు స్థానిక బిస్మిల్లా ఫంక్షన్ హాల్లో గెట్‌టుగెదర్ నిర్వహించారు. ఇక పుట్లూరు మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1986వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు, శెట్టూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.


కణేకల్లులో..


పుట్లూరులో..


శెట్టూరులో..

జూదరుల అరెస్టు

రాయదుర్గం, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పేకాటకేంద్రంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. అందులో పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 52 పేకాట ముక్కలు, రూ. 4500 నగదు, నాలుగు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గుత్తి,మే11(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లోని గోల్డ్‌షాపు కాలనీలో నివాసముంటున్న అమీర్‌బాషా(48)అనే వ్యక్తి తన ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతను ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగించేవాడు. అయితే ఆదివారం ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ సురేష్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అమీర్‌బాషా రెండు రోజుల క్రితం మృతి చెందినట్లు గుర్తించారు. గుండెనొప్పితో మృతిచెందాడా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి మెరవణిలో ఘర్షణ

తాడిపత్రి, మే11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో శనివారం రాత్రి జరిగిన పెళ్లి మెరవణిలో ఇరువర్గాల వారు ఘర్షణ పడడంతో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామంలో దుబ్బన్న, సుబ్బయ్య వర్గీయుల మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. కాగా దుబ్బన్న కుటుంబీకులు పెళ్లి మెరవణి నిర్వహిస్తూ.. సుబ్బయ్య ఇంటి సమీపంలో రాగానే టపాసులు కాల్చారు. ఇందుకు సుబ్బయ్య వర్గీయులు ఇక్కడ టపాసులు కాల్చరాదని వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో తోపులాట జరిగి ఘర్షణకు దారి తీసింది. ఇందులో రమేష్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. అతడిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఇరువర్గాల వారికి నచ్చజెప్పి పంపించారు.

తాలూకా కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం, మే 11(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తాలూకా స్థాయి సంఘం కార్యవర్గ ఎన్నికను ఆదివారం పట్టణంలోని పశువైద్యశాలలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రామునాయక్ నేతృత్వంలో జరిగిన ఎన్నిక ఏకగ్రీవంగా సాగింది. అధ్యక్షుడిగా డాక్టర్ పీ నవీన్‌కుమార్, కార్యదర్శిగా రామాంజులరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా నూర్‌బాషా, ట్రెజరర్‌గా డీ. సూర్యనారాయణరెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎం. రేణుకాదేవి, ఎం. ఆదినారాయణ, హెచ్. గోవిందప్ప, డీ. సుబ్రమణ్యం, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కేఆర్. శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా పీ. సరోజ, ఎం. ప్రమీళ, కే రూప, ఎం. హరికృష్ణనాయక్, సీ వసంతకుమార్‌లు ఎన్నికయ్యారు.

● శెట్టూరు: కళ్యాణదుర్గంలో ఏపీ ఉద్యోగుల సంఘం ఎన్నిక జరిగింది. ఇందులో కంబదూరు యూనిట్ (శెట్టూరు, కంబదూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం)కు సంబంధించి అధ్యక్షుడిగా వీరేంద్ర, అసిస్టెంట్ అధ్యక్షుడిగా వై సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా గొల్ల వీరేష్, జీ అనిల్‌కుమార్, కార్యదర్శిగా ఏ రాజు, ట్రెజరర్‌గా బి సత్యనారాయణను ఎన్నుకున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరాన్ని పరిశీలిస్తున్న కాలవ

రాయదుర్గం, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన బసవతారకం స్మారక కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ కేవలం పరీక్షలతో సరిపెట్టకుండా చికిత్స బాధ్యత కూడా తీసుకొంటామని పేర్కొన్నారు.

గ్రాండ్‌టెస్టులతో డీఎస్సీ అభ్యర్థులకు మరింత ప్రోత్సాహం..

రాయదుర్గం: మెగా డీఎస్సీ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు గ్రాండ్ టెస్టులు ఎంతో ఉపయోగపడతాయని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రాండ్‌టెస్టులో 76 మంది డీఎస్సీ అభ్యర్థులు హాజరై పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాన్ని కాలవ సందర్శించి మాట్లాడారు. జూన్ 6 నుంచి జూలై 6వ తేదీ వరకు జరిగే డీఎస్సీ పరీక్షల్లో రాయదుర్గం ప్రాంత అభ్యర్థులు ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇచ్చామన్నారు. ఇప్పటికే ఉచిత కోచింగ్‌తో పాటు నాణ్యమైన మెటీరియల్‌ను అందించామన్నారు. వారికి మరింత ప్రోత్సాహం అందించేందుకు గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తున్నామని తెలిపారు. అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాయదుర్గం: పట్టణంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయమే అర్చకులు ఆలయంలో ధ్వజారోహణ తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు.తర్వాత సాయంత్రం ఉత్సవ మూర్తిని సింహవాహనంలో కొలువుదీర్చి ఊరేగించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆలయానికి చేరుకుని స్వామికి ప్రత్యేకపూజలు చేయించి ఊరేగింపులో పాల్గొన్నారు.

యాడికి కాలువకు నీరు విడుదల చేయాలి

పెద్దవడుగూరు, మే11(ఆంధ్రజ్యోతి): యాడికి కాలువకు నీటిని విడుదల చేసి బీడు భూములకు నీరు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడుయాదవ్ డిమాండ్‌చేశారు. మండలంలోని కదరగుట్టపల్లి గ్రామసమీపంలో ఉన్న హెడ్ రెగ్యులేటరీ దగ్గర ఉన్న యాడికి కాలువను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ మేరకు డిమాండ్ చేశారు. పలువురు నాయకులు రైతులు పాల్గొన్నారు.